సన్నాలకు బోనస్ వచ్చేనా ?

- 2,183 మంది రైతుల ఎదురుచూపులు
- కొనుగోలు కేంద్రాల్లో సన్నాల విక్రయాలు
- 12231.52 మెట్రిక్ టన్నుల సన్నాల సేకరణ
- ఇంకా విడుదల చేయని ప్రభుత్వం


ఖానాపురంలో ధాన్యపు రాశులు(ఫైల్)


సన్నాలను బస్తాల్లో నింపుకున్న రైతులు (ఫైల్)

ఖానాపురం : ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో రైతులు సాగు చేసుకున్నారు.. దళారీలకు కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకున్నారు. విక్రయాలు చేపట్టి రోజులు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు. సన్నాల సాగు చేసుకునే రైతులు బోనస్ డబ్బులు ఆలస్యమవుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలో నేటి వరకు బోనస్ డబ్బులు జమ కాకపోవడంతో రైతులు ఎదురుచూపులు తప్పడం లేదు.. మండలంలోని పాకాల ఆయకట్టు పరిధిలో 29,500 ఎకరాల్లో వరి పంటలు సాగు అయ్యాయి. ఆయకట్టు కింద ఖానాపురం, నర్సంపేట, చెన్నారావుపేట మండలాలకు చెందిన రైతులు పంటల సాగు చేసుకున్నారు. యాసంగిలో వరి కోతలు పూర్తి చేసుకొని కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు చేపట్టారు. సన్నాలకు ప్రభుత్వం బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రైతులు సన్నాల సాగును సైతం చేపట్టారు. సన్నాలను విక్రయించుకోవడానికి అనేక ఇబ్బందులకు సైతం ఓర్చుకున్నారు. ఇందులో ఖానాపురం సొసైటీ ఆధ్వర్యంలో ఏడు కొనుగోలు కేంద్రాలు, మాక్స్‌ల ఆధ్వర్యంలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలు, మూడు చెన్నారావుపేట పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలు, ఒక ఎఫ్‌పీఓల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. ఇందులో 2,183 మంది రైతులకు చెందిన 12231.52 మెట్రిక్ టన్నుల సన్నధాన్యాన్ని రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తి కావడంతో పాటు రైతులకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ అయినప్పటికీ సన్నాలకు సంబంధించిన బోనస్ మాత్రం ఇంకా జమకాలేదు. బోనస్ డబ్బుల కోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు.

646 బస్తాలు విక్రయించా..



కౌలుకు తీసుకున్న భూమిలో సన్నరకాలను సాగు చేశాను. 12 ఎకరాల్లో 1638 రకానికి చెందిన సన్నాలను నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాను. 646 బస్తాలను విక్రయించగా ఇప్పటి వరకు బోనస్ కింద రావాల్సిన డబ్బులు ఇంకా ఖాతాలో జమకాలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి బోనస్ డబ్బులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

– బోడ పూలునాయక్, రైతు, ఖానాపురం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ కొమురయ్య


వర్ధన్నపేట: డిప్యూటీ డీఎంహెచ్ఓ కొమురయ్యను సన్మానిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

వర్ధన్నపేట : వానాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్య వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఓపీ విభాగం, ల్యాబ్, ఫార్మసీ, ఇన్‌పేషెంట్ విభాగాలతో పాటు వార్డులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బంది పలు సూచనలు చేశారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ కొమురయ్యను వైద్యాధికారులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహాస్వామి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్వతగిరి: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి వి.ఉదయ్‌రాజ్ సూచించారు. ఈ సందర్భంగా సోమవారం సీజనల్ వ్యాధులపై వివరించారు. దోమలు, ఈగలు, ఆహారం, నీటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత ఖచ్చితంగా పాటించాలి. ఇంటి పరిసరాల్లో చెత్తా చెదారం, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇంట్లో వండిన ఆహార పదార్థాలు వేడిగా తినాలి. ఏదైనా అనారోగ్య సమస్య ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లి తగు చికిత్స పొందాలి.

ఎమ్మెల్యేను విమర్శించే నైతిక హక్కు ఎర్రబెల్లికి లేదు

- కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి


సమావేశంలో మాట్లాడుతున్న తూళ్ల రవి

వర్ధన్నపేట : అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతున్న ఎమ్మెల్యే నాగరాజును విమర్శించే నైతిక హక్కు ఎర్రబెల్లి దయాకర్‌రావుకు లేదని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తూళ్ల రవి అన్నారు. సోమవారం వర్ధన్నపేట క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవి మాట్లాడుతూ దయాకర్‌రావు చరిత్ర అందరికీ తెలుసని, రేషన్ బియ్యం అమ్ముకొని దందాలు చేసిన ఎర్రబెల్లి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎర్రబెల్లి త్వరలో జైలుకు వెళ్తారని ఆరోపించారు. అనుచిత, అవాస్తవ వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్ ఎర్రబెల్లి చూస్తూ ఊరుకోమని, గ్రామాల్లో తిరగకుండా అడ్డుకుంటామని పేర్కొన్నారు. వర్ధన్నపేట అభివృద్ధి పై చర్చకు మేం సిద్ధం మీరు సిద్ధమా అని సవాల్ చేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, సీనియర్ నాయకులు పోశాల వెంకన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, మహమ్మద్ అక్బర్, బుచ్చిమల్లు, కుమారస్వామి, ఉపేందర్, భాస్కర్, సురేందర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోస్తున్న సత్యనారాయణ

వర్ధన్నపేట : అర్హులైన పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు మండలంలోని ఇల్లంద గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క పేదవాడికి కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వకుండా మోసం చేసిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో పేదలకు ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గడ్డం సమ్మయ్య, దుప్పెల్లి ఏలియా, దేవాలయ చైర్మన్ మైదం బుచ్చిమల్లు, ఐనవోలు దేవస్థానం డైరెక్టర్ గుంటి కుమారస్వామి, తాటిగాల రాములు, మల్లెపాక సిద్దయ్య, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ మండల కమిటీ నియామకం


నియామక పత్రాన్ని అందిస్తున్న కర్నాటి పార్వతమ్మ

నర్సంపేట : చెన్నారావుపేట మండల మహిళా కాంగ్రెస్ నూతన కమిటీని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు బండి పద్మ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మలు హాజరై నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందించారు. మహిళా కాంగ్రెస్ బ్లాక్ కార్యదర్శిగా ధోని కమలమ్మ, మండల ఉపాధ్యక్షులుగా ఊడుగుల పద్మ, లావుడ్యా శాంతి, ప్రధాన కార్యదర్శులుగా భూక్య మమత, అనుముల సుకన్య, కార్యదర్శులుగా ధరావత్ సునీత, నాగోతు శారీ, సహాయ కార్యదర్శులుగా ఉప్పునూతుల లలిత, ముదురు సుగుణ, భూక్య సుజాతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మండల కమిటీలో అవకాశం ఇవ్వడానికి సహకరించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేష్‌యాదవ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్యగౌడ్, మండల నాయకులు మైబుసింగ్ రాథోడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తూటి పావని, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రామరపు శిరీష, జిల్లా కోఆర్డినేటర్ కోతి మమత, సునీత, రాధిక, అనూష, తదితరులు పాల్గొన్నారు.

రుద్రగూడెంలో ఫర్టిలైజర్ షాపుపై దాడులు


గడువు దాటిన పురుగుల మందులను పరిశీలిస్తున్న సీఐ సాయి రమణ

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెంలో హనుమాన్ ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ షాపుపై నర్సంపేట రూరల్ సీఐ సాయిరమణ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రగూడెం గ్రామానికి చెందిన మామిండ్ల శ్రీనివాస్ తన ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ షాపులో గడువు దాటిన పురుగు మందులు అక్రమంగా నిల్వ చేశాడనే పక్కా సమాచారం మేరకు దాడులు చేశారు. గడువు దాటిన రూ.9,800 విలువైన పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఏఓ రజిత, తదితరులు పాల్గొన్నారు. ఏఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తెలిపారు.

ఎన్నికల హామీలను అమలు చేయని కాంగ్రెస్


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

వర్ధన్నపేట : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ వర్ధన్నపేట మండల అధ్యక్షులు తూళ్ల కుమారస్వామి, మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి ఆరోపించారు. త్వరలో మండలంలోని ఉప్పరపెల్లి ఎంపీటీసీ పరిధిలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా సోమవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల్లో విస్తృతంగా చర్చించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మాజీ దేవస్థాన చైర్మన్ ఎరుకొండ వేణుగోపాల్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు దాడి రాజు, మాజీ సర్పంచ్ ఆరెల్లి స్రవంతి, అంజన్ రావు, రైతు కన్వీనర్ గోక రవి, దేవస్థానం డైరెక్టర్ గోక రాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవద్దు

- 16వ డివిజన్ కార్పొరేటర్ మనీష

గీసుకొండ: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గతంలో బీఆర్ఎస్ సర్కారు హయాంలో మంజూరైన నిధుల విషయంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టకుండా అడ్డుకోవడం సరైంది కాదని 16వ డివిజన్ కార్పొరేటర్ సుంకరి మనీష సోమవారం ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ సర్కారు కీర్తినగర్‌లో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం కోసం రూ. 1.50 కోట్లు, గరీబ్‌నగరలో రూ.1.40 కోట్ల నిధులను మంజూరు చేశారని తెలిపారు. అయితే టెండర్లు పూర్తి అయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పనులు జరగకుండా కాంట్రాక్టర్లను బెదిరించి నిలిపివేశారని ఆరోపించారు. బీఆర్ఎస్‌పై కోపంతో ఎమ్మెల్యే పేదలకు చెందాల్సిన సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడం పై స్థానిక కార్పొరేటర్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుంకరి శివ, డివిజన్ అధ్యక్షులు పోగుల సంజీవ, నాయకులు పాల్గొన్నారు.

సహకార సంస్థలతోనే ప్రభుత్వ పథకాలు అమలు

- రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు


హార్వెస్టర్‌ను ప్రారంభిస్తున్న మార్నేని రవీందర్‌రావు

వర్ధన్నపేట: రాష్ట్రంలో రైతుబంధు, రైతుబీమా వంటి ప్రభుత్వ పథకాలు సహకార సంస్థల సహకారంతో సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. అంతర్జాతీయ సహకార వేడుకల్లో భాగంగా నాబార్డ్ ఆధ్వర్యంలో సోమవారం వర్ధన్నపేట మున్సిపాలిటీలోని డీసీసీబీ, పాక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా బ్యాంక్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మార్నేనీ మాట్లాడుతూ జిల్లా సహకార బ్యాంకులో (డీసీసీబీ) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) రుణ, సరఫరా, మార్కెటింగ్, డెయిరీ, హౌసింగ్ వంటి అనేక రంగాల్లో సహకార సంస్థలు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో మహిళా సహకార సంఘాలు, స్వయం సహాయక సమూహాలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. యువతకు సహకార రంగాల్లో శిక్షణ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. అనంతరం రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన రైతు చిర్ర వేణుకు డీసీసీబీ వర్ధన్నపేట బ్రాంచి ద్వారా రూ.27 లక్షల వాహన రుణం కింద మంజూరైన హార్వెస్టర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ వజీర్ సుల్తాన్, నాబార్డ్ డీడీఎం రవి, పాక్స్ చైర్మన్ రాజేష్ కన్నా, డీసీసీబీ డీజీఎం అశోక్, ఏజీఎంలు గొట్టం స్రవంతి, మధు, రాజు, బ్రాంచి మేనేజర్లు సమత, భద్రునాయక్, బ్యాంకు, సొసైటీ ఉద్యోగులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'క్షయ' నివారణకు జాగ్రత్తలు పాటించాలి

దామెర : క్షయ వ్యాధి (టీబీ) నివారణకు జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ జాస్మిన్ మెహెరా సూచించారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఊరుగొండ, పులుకుర్తి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాల్లో సోమవారం టీబీ ఆక్టివ్ కేస్ ఫైండింగ్ కార్యక్రమంలో భాగంగా 85 మంది నుండి నమూనాలు సేకరించారు. పరీక్షించిన అనంతరం 12 మంది అనుమానితులను 102 వాహనంలో హనుమకొండలోని ప్రభుత్వ జాతీయ క్షయ దవాఖానకు తదుపరి పరీక్షల నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు కలిగిన వారు వెంటనే పీహెచ్‌సీలో,ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని అన్నారు. ప్రారంభ దశలో వ్యాధిని గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎస్ శ్రీనివాస్, ఎల్‌టీ జనార్దన్, సూపర్‌వైజర్ శ్రీకాంత్, పద్మ, శోభారాణి, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి వాడొద్దు

- పంటపూర్తయ్యే సరికి మూడుసార్లు యూరియా వేయాలి
- అధికారుల సూచనలు, సలహాలు మాత్రమే పాటించాలి


మెందు అశోక్, ఏఈఓ



నర్సంపేట రూరల్ : వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనల అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన నత్రజని (యూరియా) మోతాదుగా వాడుకోవాలన్నారు. వరి సాగుచేసే రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు యూ రియాను మోతాదుగా వాడుకొని పంటను కాపాడుకోవాలని సూచించారు. వరి నాటు వేసినప్పటి నుంచి పంట పూర్తయ్యేలో మూడు సార్లు చొప్పున 96 కిలోల యూరియా మాత్రమే పంటపై వాడాలి. వరి పంట మొత్తం కాలంలో ఒక ఎకరానికి మూడుసార్లు యూరియా వాడాలని నాటు వేసిన 15 రోజులకు 30 కిలోలు, 30 రోజుల తర్వాత 35 కిలోలు, పొట్టదశలో 31 కిలోల చొప్పున మాత్రమే యూరియాను వేసుకోవాలన్నారు. అంతేకాకుండా యూరియా అందుబాటులో లేకపోతే నానో ప్లస్ ద్రవరూప యూరియా 20శాతం (డబ్ల్యూ/వీ)ను ఒక అర లీటర్ ఎకరానికి నేరుగా వరి పంటపై స్ప్రే చేయాలన్నారు. అర లీటర్ రూ. 220 చొప్పున మార్కెట్‌లో అందుబాటులో ఉందని, ఇలా చేయడం వల్ల కొంత మేరకు ఖర్చులను తగ్గించుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచించారు.

నానోప్లస్ యూరియాతో ఉపయోగాలు...

గ్రీన్ హౌస్ వాయువుల ప్రభావం పర్యావరణపై ఉండదు. (గుళికల రూపంలో ఉన్న యూరియా వాడడం వల్ల, మన పంట పొలాల నుంచి వెలువడే మిథేన్, కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డైయాక్సైడ్ చాలా వరకు తగ్గించబడుతుందన్నారు. వరిపత్రాలపై ఎక్కువ విస్తీర్ణంలో నత్రజని వ్యాప్తి సరైన అధిక మోతాదులో అయి, వరి పత్రాలచే అత్యంత సూక్ష్మ రూపంలో ఉన్న నత్రజని వేగంగా, సంపూర్ణంగా, అధికంగా గ్రహించబడుతుంది. వినియోగ సామర్థ్యం అత్యధికంగా ఉండి, మొక్క ఆరోగ్యవంతంగా పెరుగుదల ఉండి నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది. మృత్తిక వాతావరణం పై పెద్దగా చెడు ప్రభావం చూపించదు. నత్రజని మొక్క వేళ్లకు అందకుండా నేల లోపలికి ఇంకిపోయే నష్టం ఉండదు. నానో ప్లస్ ద్రవరూప యూరియాను వరి పంటకే కాకుండా పత్తి, మొక్కజొన్న, ఎండు మిరుప, పప్పు దినుసులు, ఇతర అన్ని పంటపై పిచికారీ చేసుకోవచ్చు. రైతులు సాగుచేసే పంటలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సూచనల మేరకు యూరియాను, రసాయన ఎరువులను వాడి పర్యావరణం, ఇతర జీవరాశుల గొలుసు, విషపూరితం కాకుండా చూసుకోవాలని మండలంలోని గురిజాల క్లస్టర్ ఏఈఓ మెందు అశోక్ తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుల శాంతి దీక్ష


నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న శ్రీనివాస్

నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం శాంతియుత దీక్ష చేపట్టారు. శాంతియుత దీక్షకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం నిరంతరం పోరాటం చేసిన ఉద్యమకారులను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 250 గజాల ఇంటి స్థలం, రూ.25వేల పెన్షన్, ఫ్రీగా రైల్వే, బస్సు పాస్‌లతో పాటు ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం దీక్షలో పాల్గొన్న ఉద్యమ నాయకులకు డ్యాగల శ్రీనివాస్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం పట్టణ ఉపాధ్యక్షులు భేతి విశ్వబంధు(భాస్కర్) మద్దెల శ్యామ్‌కుమార్‌యాదవ్, పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, యువజన సంఘం కార్యదర్శి గోపగాని నాగరాజుగౌడ్, బీసీ సంఘం నాయకులు నూనె రంజిత్, మారపాక రమేష్, శీరంశెట్టి రాజేందర్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంఎల్‌టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పర్వతగిరి : స్థానిక కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) గ్రూప్‌లో సబ్జెక్టు బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఈఓ గాయపు లింగారెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నాజియాసల్మా మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టుకు దరఖాస్తు చేసుకోబోయే అభ్యర్థి ఎం.డి పాథాలజీ/మైక్రో బయోలజీ/బయోకెమిస్ట్రీ/డీసీపీ, ఎమ్మెస్సీ మైక్రో బయోలజీ/బయోకెమిస్ట్రీ/ ఎంఎల్‌టీ, బీ ఫార్మసీ/ ఎమ్మెస్సీ జెనెటిక్స్, ఎంబీబీఎస్/ఎంబీబీఎస్(హోం) బీహెచ్ఎంఎస్, పీజీడి క్లినికల్ బయోకెమిస్ట్రీ అర్హతల్లో ఏదైనా ఒకటి తప్పని సరిగా ఉండాలని తెలిపారు. దరఖాస్తులు జూలై 3 వరకు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు నేరుగా పర్వతగిరి కస్తూర్బా పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేయాలి


మాట్లాడుతున్న యాకయ్య

పర్వతగిరి: ఈనెల 7న గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ గద్దెల వద్ద జెండాలు ఎగురవేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య మాదిగ కోరారు. మండలంలోని అన్నారంలో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ 7న జెండాలను ఎగురవేసి మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడిగా ఒగ్గు కిరణ్, ఉపాధ్యక్షుడిగా మునిగంటి యాకాంబ్రం, ప్రధాన కార్యదర్శిగా నకిరేకంటి రామచందర్, ముఖ్య సలహాదారులుగా ఒగ్గు భాస్కర్, కొండేటి వెంకటసాయిలు, మంగయ్యలను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యే నాగరాజుకు ఆహ్వానం


ఆహ్వాన పత్రం అందజేస్తున్న మేదరి సంఘం నాయకులు

వర్ధన్నపేట : జూలై 6న హనుమకొండలో నిర్వహించే తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర స్థాయి సమావేశానికి హాజరుకావాలని ఎమ్మెల్యే నాగరాజుకు మేదరి సంఘం నాయకులు సోమవారం ఆహ్వానపత్రం అందజేశారు. అందజేసిన వారిలో మేదరి సంఘం మండల అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి దీకొండ ఉపేందర్, మండల ప్రధాన కార్యదర్శి బొమ్మిడమి సోమయ్య, ప్రతాపగిరి గోవర్ధన్, గణేష్, తదితరులు ఉనానరు.

దుర్భాషలాడిన వ్యక్తిపై ఫిర్యాదు

నర్సంపేట: పాఠశాలకు వచ్చి దుర్భాషలాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెన్నారావుపేట మండలం ఎల్లాయగూడెం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం ఆంగోతు భద్రయ్య, ఉపాధ్యాయులు యాకయ్య, రాజాలు సోమవారం తెలిపారు. గత ఏడాది జరిగిన నియామకాల్లో స్కావెంజర్ పోస్టు తనకు ఇవ్వలేదనే కోపంతో శనివారం సాయంత్రం ఇదే గ్రామానికి చెందిన పుటికల ముత్తయ్య పాఠశాలలోకి వచ్చి ఉపాధ్యాయులు యాకయ్య, రాజులను స్కావెంజర్ పోస్టు తనకు ఎందుకు ఇవ్వలేదని, మిమ్మల్ని గొడ్డలితో నరుకుతానని బెదిరించాడు. మాకు తెలియదు హెచ్ఎం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ నిర్ణయం మేరకు నియమించారని చెప్పడంతో హెచ్ఎం భద్రయ్యను కూడా చంపుతానంటూ నానా బూతులు తిట్టి ఉపాధ్యాయులను కొట్టడానికి ప్రయత్నించాడు. ముత్తయ్య చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

గుడుంబా పట్టివేత

- మహిళపై కేసు

శాయంపేట : మండల కేంద్రంలో 10 లీటర్ల గుడుంబా పట్టుకొని మహిళపై కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మేరగుర్తి లక్ష్మి ఇంటి వద్ద గుడుంబా అమ్ముతుందనే పక్కా సమాచారంతో లక్ష్మి ఇంటికి వెళ్లి పరిశీలించగా గుడుంబా అమ్ముతూ కనిపించింది. దీంతో పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని లక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు. ఎవరైనా గుడుంబా అమ్మితే వారిపై కఠిన చర్యలు ఆయన తప్పవని హెచ్చరించారు.